# పాల(రాతి)-శిల్పం



"అబ్బా! కితకితలు పెడుతోంది నాన్నా!"

"కొంచెంసేపు ఓపిక పట్టయ్యా. ఈ యేల అక్టోబర్ రెండు. ఈ యేల ఈ ఏసం కడితే బోలెడంత పేరొత్తాది" అని కొడుకును సముదాయిస్తోంది సుబ్బులక్ష్మి. గురువులు తన కొడుకు పదేళ్ళ వెంకటేశుకి విగ్రహాలకు వేసే సిల్వర్ పెయింట్ వేస్తున్నాడు.

"నీకు సదువంటే యిట్టమనే గంద మరి బడిలో సేర్పించినా! ఏదో ఆ టీచరమ్మ దయవల్ల నీకు నాలుగు అచ్చరం ముక్కలు వత్తన్నాయి. మూడు కేజీలు బియ్యం ఇత్తన్నారు. నీకో అచ్చరం ముక్క అబ్బి బగమంతుడి దయవల్ల నువ్వు కనీసం పంతులయ్య ఉద్యోగం సంపాదించినా మన జీవితం హాయిగా గడిచిపోద్దిరా అబ్బీ. ఈ యేల టౌను ఆల్లో నిన్ను ఈ ఏసంతో చూసినోళ్ళకి నిజంగా గాందీబాబుని సూసినంత సంబరం రావాల సరేనా?"

తండ్రి మాటలు వాడిలో ఉత్తేజాన్ని నింపాయి.

"సరే అయ్యా! వేషం బాగా వేస్తాను. నీకు పేరొచ్చేలా వేస్తాను. నువ్వే చూద్దువుగాని" అన్నాడు వెంకటేశు మెరిసే కళ్లతో.

ఆ రోజు గాంధీ జయంతి.

ఆ ఎలిమెంటరీ మున్సిపల్ పాఠశాల స్వర్ణోత్సవాల సందర్భంగా హెడ్‌మిస్ట్రస్ రాజేశ్వరిదేవి విద్యార్థుల తల్లిదండ్రులనుండి కార్గిల్ యుద్ధ క్షతగాత్రుల నిమిత్తం కలెక్ట్ చేసిన ఫండును చెక్ రూపంలో ఎంఆర్‌వో గారికి అందించడానికి సర్వసన్నాహాలు చేసింది. సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థుల బృందంచేత 'సెల్ఫ్ బిఫోర్ సెల్ఫ్' అన్న అంశాన్ని నాటకంగా వేయిస్తోంది. తపస్సులా భావించి ట్రైనింగ్ ఇచ్చిన ఆమె విధానమే గురువులకి ఎంతగానో నచ్చేసింది.

గురువులు, తాత ఒడినే బడిగా చేసుకుని విజ్ఞానం సంపాదించాడు. అతని తాత గాంధీగారి ఉద్యమ స్ఫూర్తి, దేశభక్తి, దేశ ప్రజలను సంఘటితం చేయడంలోనూ గాంధీ తాత చూపిన నేర్పు గురించి కథలు కథలుగా చెబుతున్నప్పుడల్లా ఎదురుగా తెల్లవాళ్ళు ఉంటే నిలువునా నరికేద్దామన్నంతగా ఆవేశంతో కంపించిపోయేవాడు. ఆ కథలే అతనిని చిన్ననాటి నుంచీ గాంధేయవాదిగా చేశాయి.

నేలమీద చీమని కూడా చూసి మరీ

అడుగువేసే అతని ప్రతి కదలికలోనూ గాంధేయతత్వం స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. చిన్ననాటినుంచీ కష్టపడి పనిచేసి, వచ్చిన డబ్బులతో కోళ్ళను పెంచి అమ్మడమేగానీ, గుడ్డుకూడా తినని శాఖాహారి గురువులు. అవ్యాజమైన అతని దేశభక్తి ముందు ఈనాటి ఏ రాజకీయ నాయకుడైనా తల వంచుకుని తీరవలసిందే.

సభా ప్రారంభం అయింది. కార్గిల్ యుద్ధక్షతగాత్రుల ఫండ్ కలెక్షన్ కోసం వెంకటేశు బృందం ఎంత కష్టపడిందీ హెడ్‌మిస్ట్రెస్ రాజేశ్వరిదేవి వివరించి చెబుతుంటే అభం శుభం తెలియని ఆ పిల్లలు పడ్డ కష్టానికి సభికుల కళ్ళు చెమర్చాయి. ప్రతిరోజూ ఉదయం కొవెలకి, సాయంవేళల బస్‌కాంప్లెక్స్, రైల్వేస్టేషన్‌లో తిరిగి సేకరించిన మొత్తం సుమారు మూడువేల నాలుగువందల రూపాయల చిల్లరచూసి సభికులు ముక్కున వేలేసుకున్నారు. అందరూ ఆ లేత మనసుల్నీ, వాళ్ళను ప్రభావితం చేసిన రాజేశ్వరిదేవిని వేనోళ్ళ కొనియాడారు.

తరువాత నాటకం ప్రదర్శింపబడింది. ఒక్కక్షణం రెప్పవేస్తే అద్భుత దృశ్యం మిస్సయిపోతామేమో అన్న రీతిలో వెంకటేశు గాంధీ పాత్రలో లీనమై నటిస్తుంటే చూసినవారికి కంటిచూపుతప్ప నోటిమాటే లేకుండా పోయింది. అతడు 'హేరామ్' అంటూ నేలకొరిగిన దృశ్యం అందరి హృదయాలనీ కంట తడి పెట్టించింది.

వెంకటేశుకి ఎమ్మార్వో ప్రత్యేక ప్రశంసలతోపాటు ఐదువందల రూపాయల నగదు బహుమతిని స్వయంగా అందించారు. ఆయనను చూసి మిగతా అధికారులంతా కూడా సహాయం చేసేసరికి వేయి రూపాయల పైబడిన మొత్తం వెంకటేశుకి లభించింది.

ఆనందోత్సాహాల మధ్య ఫంక్షన్ దిగ్విజయంగా ముగిసింది.

★★★

ఎంతో ఉత్సాహంతో ఇల్లు చేరిన వెంకటేశు తల్లిదండ్రుల ఆనందానికి అవధులులేవు. గురువులు 'వెంకటేశుని' ఎత్తి గిరగిరా తిప్పేశాడు.

"కళ్ళు తిరుగుతున్నాయయ్యా!' అంటున్నా వినిపించుకోలేదు.

"ఆడిని అంత ఎత్తు ఎగరేసి తిప్పేత్తన్నావేంటి? సంతోసం వచ్చినా, ఏడుపొచ్చినా నిన్ను అట్టుకోలేం మావా. ఇంకసాల్లే దింపు. సంబడం సంబడమాని" అంటూ బలవంతంగా గురువులు చెయ్యిపట్టి ఆపింది సుబ్బులక్ష్మి.

"నీకు మాత్తరం సంబడం కాదా ఏటి?" ఆమెకు చక్కిలిగిలి పెడుతూ అన్నాడు గురువులు.

"పిల్లోడుండగా సరసమేంటి మావా? అద్సరేగానీ ఆడికి ఈ ఏల అయినా కాసింత మంచి ఎణ్ణం తెచ్చి పెట్టు. 'మంచి వణ్ణం'

అంటే వెజిటబుల్‌పలావు అని ఆమె అర్థం.

'ఓ అట్టాగే" హుషారుగా బయల్దేరబోతూ వెంకటేశు దగ్గరకు వచ్చి "అడ్డమైన ఎదవ నాయాళ్ళ ఇళ్ళకి ఎల్లకురా అయ్యా! ఇప్పుడే వచ్చేత్తాను" అంటూ వెంకటేశుని ముద్దు పెట్టుకుని హోటల్‌కి వెళ్లిపోయాడు. పెళ్ళి అనంతరం జరిగే విందులా సంతోషంగా వారి రాత్రి భోజనాలు పూర్తయ్యాయి.

ఆ రాత్రంతా వెంకటేశు భవిష్యత్తు గురించి గురువులు, సుబ్బులక్ష్మి ఒకటే ప్రణాళికలు వేసుకోసాగారు.

తన బిడ్డ కష్టార్జితం వెయ్యికి పైగా! ఒక్కసారి అంత మొత్తం తమ జీవితంలో చూడలేదు.

రిక్షా అద్దెకు తీసుకొని ఏరోజు కిరాయి ఆ రోజు చెల్లించగా మిగిలిన డబ్బు రోజుకి వంద లోపే. అందులో కొంత మొత్తం పోస్టాఫీసులో వేయిస్తోంది రాజేశ్వరిదేవి. ఆమె మాట ఆ దంపతులకి వేదంతో సమానం. ఆమె, వాళ్ళ కళ్ళకి తెనాలి రామలింగడిని అనుగ్రహించిన దుర్గామాతలా కనిపిస్తుంది.

వాళ్ళిద్దరూ కలసినప్పుడల్లా అంటుంది ఆమె. "చూడు గురువులూ! వెంకటేశుకి అసాధారణమైన తెలివితేటలున్నాయి. ఏది చెప్పినా వెంటనే అర్థం చేసుకోగల విజ్ఞత భగవంతుడు వెంకటేశుకిచ్చాడు. అలాంటి అదృష్టం వున్న నీ కొడుకుని భగవంతుడి ప్రసాదంగా భావించి, నువ్వు కష్టపడి చదివించు. నా చేతనైనంత సాయం నేనూ చేస్తాను. మట్టిలో మాణిక్యంలా ప్రకాశించాలంటే వాడిని అన్నివిధాలా మెరుగు పెట్టాలి. అందుకు అవసరమైనది డబ్బు. వాడిని ఉన్నతస్థితిలో చూడగలనన్న నమ్మకం నాకు వుంది. అందుకోసం శ్రమించు. ఆ తరువాత వాడిని చూసి నువ్వు గర్వపడినంతగా మరెవ్వరూ గర్వించరు. ఆ ఆనందం నీకు దక్కాలనుకుంటే ఆలోచించి అడుగువేయి."

ఆ మాటలు అనుక్షణం వారిద్దరినీ స్పందింపజేస్తూనే ఉన్నాయి. అందుకే అంతగా ఆలోచిస్తున్నారు. ఆ డబ్బుతో ఏం చేయాలా అని? పోస్టాఫీసులో రెట్టింపు అయ్యేలా వేస్తే ఎలా వుంటుంది? లేదా ఈ డబ్బుకి కొంత అప్పుచేసి సొంత రిక్షా కొనుక్కుంటే ఎలా వుంటుంది? పోనీ నాలుగు చక్రాల బండిమీద ఏదైనా వ్యాపారం ప్రారంభించేదా?

మొత్తానికి ఒక నిర్ణయానికి రాలేని ఆ దంపతులు దీనికి పరిష్కారకర్త కూడా రాజేశ్వరిదేవిగారే అని నిర్ణయానికి వచ్చి అమాయకత్వం ముఖంలో నింపుకుని నిద్రపోతున్న బిడ్డని ముద్దులు పెట్టుకుని నిద్రకు ఉపక్రమించారు. వారి అంతరంగాల నిండా ఇంద్రధనస్సు రంగుల్లో కలలే!

★★★

మరుసటిరోజు ఉదయం-

గొల్లుమంటున్న తల్లి ఏడుపువిని ఉలిక్కిపడి లేచిన వెంకటేశు కొయ్యబారిపోయాడు.

ఎదురుగా తండ్రి శవం.

కొడుకుని చూస్తూనే "ఒరే అయ్యా! మీ నాన్న మనిద్దర్ని అన్యాయం సేసి ఎల్లిపోయాడ్రా! రాత్రంతా ఎన్నెన్ని కలలు కన్నాడో! ఎంత సంబరపడిపోయాడో! ఆ మాయదారి గుండెనొప్పి ఇప్పుడే రావాలా? ఇంక మనకు దిక్కు ఎవడ్రా దేవుడో?" అంటూ కొడుకుని గుండెల్లో దాచుకుని గుండెలు పగిలేలా రోదించసాగింది.

తనని ఎంతో అపురూపంగా పెంచిన తండ్రి తన ముందు కదలిక లేకుండా శూన్యంలోకి చూస్తున్నట్లుగా జీవంలేని కళ్లతో పడుకుని ఉండడం చూస్తూనే ఆ లేత హృదయం కణకణమండుతున్న నిప్పుల కొలిమిలా తయారైంది.

భగవంతుడు అసలు పేదవాళ్ళను ఎందుకు పుట్టిస్తాడు?

ఆ ప్రశ్న వాడు తనలో తాను చాలాసార్లు వేసుకున్నాడు.

తండ్రి రూపాయినిచ్చి కొనుక్కో మన్నప్పుడల్లా కళ్లముందు ఐస్‌క్రీమ్, రకరకాల చాక్లెట్లు. అందమైన బెలూన్లు అన్నీ... అన్నీ ఈ లోకంమీద కసి తీరా కొనేసుకుందామని ఎంతో ఆవేశపడినా విచక్షణ దాన్ని పొదుపు చేయమనేది. వాడి లేత హృదయం అందమైన ఫ్లవర్ వాజ్ పగిలినట్లు భళ్ళున బద్దలై తండ్రి శవంమీద పడి వెక్కివెక్కి ఏడవసాగాడు.

విషయం తెలుసుకున్న రాజేశ్వరిదేవి అన్నివిధాలా సుబ్బులక్ష్మిని, వెంకటేశుని ఓదార్చింది. కావాల్సిన అన్ని ఏర్పాట్లు చూసిందామె.

అయినా ఆ పాల మనసులో ఎన్నో ప్రశ్నలు. రేపటి నుంచి అమ్మని తాను చదువు మానేసి పోషించాలా? లేదా అమ్మే తనని చదివిస్తుందా? అందుకు ఏం చేయాలి? ఆ పసి(డి) మనసు పరిష్కారం మార్గం వెతుకుతోంది.

★★★

భర్తపోయి వారంరోజులు కూడా కాకుండానే స్కూలుకు వచ్చిన సుబ్బులక్ష్మిని చూసి విస్తుపోయింది రాజేశ్వరిదేవి.

"అమ్మా! రాత్రిపూట ఒక్కత్తినీ ఉండాలంటే బయమేత్తోందమ్మా! ఈ పదిరోజులు ఎంకటేశుని మీకాడ ఉంచుకోకుండా అంపేయండి. సుట్టుపక్కల వాల్లున్నా ఎవరి పని ఆల్లది. అంచేత పరీచ్చలొచ్చినప్పుడు మీ ఇంటికాడ సదివిద్దురుగానీ. నేను ఏం చెప్పినా యినకుండా 'మేడమ్‌గారు కోప్పడతారు' అంటూ ఆ రోజే మీకాడికి వచ్చేశాడు." అంది సుబ్బులక్ష్మి.

"అదేమిటి లక్ష్మీ! ఆ రోజు వాడిని మీ ఇంటి దగ్గర చూడడమే. ఈ పదిరోజులూ నీకు తోడుగా ఉండి అప్పుడు స్కూలుకు రమ్మన్నానే! అప్పటినుంచీ వాడు మళ్ళీ స్కూలుకే రాలేదు" అంది రాజేశ్వరి అయోమయంగా.

"అయ్యో! నా దేవుడో! నా బిడ్డను కూడా నాకు దూరం చేశావా? నేనేం సేతున్రా దేవుడో!" అంటూ కూలబడి భోరున ఏడవసాగింది. సుబ్బులక్ష్మి.

రాజేశ్వరీదేవి కళ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

"ఊరుకో లక్ష్మీ! వాడు అమాయకుడు కాదు. చాలా తెలివైనవాడు. ఏదో సాధించుకొద్దామని వెళ్లుంటాడు. నువ్వేం కంగారుపడకు. నేను ఎంక్వయిరీ చేయిస్తాను" అంటూ ధైర్యం నూరిపోసిందామె.

మరో మూడురోజులు గడిచాయి.

శివరాత్రికి ఉపవాసం వుండి కూడా సెలవురోజు కావడంతో వెంకటేశుకోసం చుట్టుప్రక్కల ఊళ్ళన్నీ వెదికించింది రాజేశ్వరీదేవి. ఫలితం శూన్యం.

★★★

ఆ నాలుగోరోజున సుబ్బులక్ష్మి వాడిని పెడరెక్కలు విరిచి బలవంతంగా స్కూలుకు తీసుకురావడం చూస్తూనే ఆశ్చర్యపోయింది రాజేశ్వరీదేవి.

"ఎక్కడ దొరికాడు లక్ష్మీ? ఎక్కడ దొరికాడు వీడు?" ఆనందం, ఉద్వేగం సమ్మిళితమైన కంఠంతో అడుగుతూ దగ్గరగా వచ్చిన ఆమె కళ్లకు వాడు మసకమసకగా కనిపించసాగాడు.

"ఆడినే అడగండమ్మా. బిక్కమొగం ఏసుకుని పొద్దుటే ఏడుత్తూ వచ్చాడు. బడికే ఎల్లనని, సదువుకోనని ఒకటే గొడవ. ఆ మాటేదో మీ ముందే సెప్పమని లాక్కొచ్చాను."

"ఏరా చెప్పు! చదువు మానేస్తానన్నావా? చెప్పు" రాజేశ్వరీదేవి కళ్లలో నిప్పులు కురుస్తున్నా, మనసులో అగ్నిపర్వతాలు బ్రద్దలయ్యే నీడలు కనిపిస్తున్నాయి.

వాడు మాట్లాడలేదు.

"నేను ఓ వందసార్లయినా అడిగానమ్మగారూ. సదూకోను. బడికెల్లను. అనే తప్ప మరో మాటేలేదు. వాడి అయ్యలా ఓపిగ్గా అడిగే శక్తి నాకు లేదమ్మా. విసిగిపోయి మీ కాడకి లాక్కొచ్చాను. పైగా కూలి పనిసేసి నన్ను పోసిత్తాడంట."

"పోనీ ఎక్కడికెళ్లాడో అదైనా చెప్పాడా?" ఆమె కంఠస్వరం పదునైన కత్తి అంచులా ఉంది.

"లేదమ్మగారూ! నే సెప్పించలేక పోయాను. నావల్ల కాలేదు." సుబ్బులక్ష్మి తప్పుచేసినట్లు తల దించుకుంది.

"అంటే తల్లిగా నీ మాట కూడా లక్ష్యపెట్టలేదన్న మాట! అంటే అమ్మ గురించి నేను చెప్పిన విషయాలన్నీ మరచిపోయాడన్న మాట. ఊహూ...కాదు, టీచర్‌గా, స్త్రీగా నేను ఫెయిల్ అయ్యానన్నమాట." ఎప్పుడూ ఆమె కళ్లలో అంత కోపం చూడని వాడు కీ ఇచ్చిన బొమ్మలా చూస్తూ చేయి చాపాడు.

ఆమె టేబుల్‌మీద పేము బెత్తం చేతిలోకి తీసుకుంది రాజేశ్వరీదేవి. సుబ్బులక్ష్మి వాడిని

గబుక్కున దగ్గరకు లాక్కుంది.

"ఆడిని ఏమీ అనకండమ్మా. ఇప్పటికే ఆడు కనిపించలేదనే కోపంతో ఒళ్లంతా కుళ్లబొడిసేసాను. మీరూ కొడితే ఆడు తట్టుకోలేడు. ఆడి ఖర్మ ఎట్టా వుంటే అట్టాగవుద్ది."

"నాకు అడ్డురాకు లక్ష్మీ" ఆమె హుంకరింపుకి సుబ్బులక్ష్మి వాడిని వదిలేసి అటు తిరిగి కొంగులో మొహం దాచుకుంది.

చెయ్యి చాపి వెంకటేశు ఒక్క అడుగు ముందుకేసాడు. తన చేతిమీద పడబోయే దెబ్బ తీవ్రతను ఊహించు కుంటూ సన్నగా వణకసాగాడు. టపటపా అరడజను దెబ్బలు పడిపోయాయి.

కళ్ళు తెరిచిన వెంకటేశు, వెనక్కు తిరిగిన సుబ్బులక్ష్మి కొయ్యబారి పోయారు. పిల్లలందరూ బిక్కచచ్చి పోయారు.

ఆ దెబ్బలు పడింది వెంకటేశు చేతులమీదకాదు.

ఆమె తన అరచేతులలోనే బలంకొద్దీ కొట్టుకున్న దెబ్బలు. క్షణాలమీద వాతలు తేలిపోయాయి. సుబ్బులక్ష్మి గబగబా ఆమె దగ్గరకువచ్చి, చేతిలోని బెత్తంలాక్కుని దూరంగా విసిరేసింది. అక్కడే కుండలో వున్న చల్లని నీరు తీసుకుని ఆమె చేతమీద ఎర్రగా రక్తం చిమ్మబోతున్న వాతలమీద నెమ్మదిగా పోయసాగింది.

రాజేశ్వరీదేవి కాళ్లకి తీగలా చుట్టుకు పోయాడు వెంకటేశు.

'మేడం! నన్ను.... నన్ను క్షమించండి మేడం. నేను చదువు మానేస్తానన్న మాట నిజమే. అయితే అమ్మని పోషిద్దామని మాత్రం కాదు" విపరీతమైన వెక్కులు వచ్చేసరికి ఆయాసంతో రొప్పుతూ ఆగాడు వాడు.

"మరి?" అనేక భావాలు కన్నీళ్ళ రూపంలో చిమ్ముతుండగా వాడిని లేవనెత్తి అడిగింది రాజేశ్వరీదేవి.

"మా అయ్యకి గాంధీగారి వేషం అంటే ఎంతో ఇష్టం. అయ్య నా చదువు గురించి ఎన్నో కలలు కన్నాడు. అందుకని చదువుకి ఎక్కువ డబ్బులు సంపాదించడంకోసం మొన్న శివరాత్రి కదా అని 'పట్టిసీమ' తిరునాళ్ళకి వెళ్లి గాంధీగారి వేషం వేసాను. వచ్చిన చిల్లర డబ్బులు రంగు వేసుకోవడానికి సరిపోయింది. పైగా అందరూ ఒకటే ఏడిపించటమూ, వెక్కిరించడమూ. గాంధీగారి వేషం ఇంక వేయను మేడమ్!"

"ఏమైంది వెంకటేశు?" ఆమె ఆశ్చర్యపోతూ అడిగింది. తన చేతి మంట బాధగా మారి గుండెలదాకా ఎగబాకినట్లయింది ఆమెకి.

"ఈ పిల్లగాంధీగారి ముందు సిగరెట్ కాలిస్తే ఏం చేస్తాడో చూద్దాంరా? మందు కొడితే ఏమంటారో చూద్దాంరా? అంటూ తాగి నా చుట్టూ తిరుగుతూ సిగరెట్ పొగ నా మొహంమీద వదిలారు. నాముందు పేకాట ఆడారు. నా చేతికర్ర లాగి నా పిలక

పీకి ఏడిపించారు మేడమ్. గాంధీ తాత అంటే వాళ్ళకి భయంలేదా మేడం?'' వాడు ఇంకా వెక్కుతూనే చెప్పిన మాటలు విని ఆమె హృదయం జాలితో నిండిపోయింది.

"చూడు వెంకూ! తెలివితేటలు ఉండి కూడా కాలం వృధా చేసుకుంటూ తాము ఏ స్థితిలో వున్నామో తెలియని మూర్ఖులు మన మధ్య ఎంతోమంది వున్నారు. కాని ఈ వేళ వాళ్ళంత స్వేచ్ఛగా ప్రవర్తించగలగడానికి కారణం ఆనాడు గాంధీ తాత దేశం మొత్తాన్ని ఏకత్రాటిమీద నడిపించి అహింసాయుధంతో దేశానికి తీసుకువచ్చిన స్వాతంత్ర్యమే.

నీవు నీ బృందంతో ఎంతో కష్టపడి పనిచేసావు. నిస్వార్ధంగా నువ్వు కృషి చేయబట్టే అంత కార్గిల్ ఫండును మనం అధికారులకు అందించగలిగాం. దాన్ని కాజేద్దాం అనే ఆలోచన ఉంటే తాత్కాలికంగా బాగుపడతామేమోగానీ చేసిన తప్పును మన మనసు ఎత్తి చూపిస్తూనే ఉంటుంది. అందరూ దానం చేయక పోయినా నువ్వు అడిగిన వెంటనే దానం చేసిన మహనీయుల మంచితనం వల్లనేరా ఇంకా సమాజం మనుగడ సాగుతోంది. అంటే కొందరైనా మంచివారు ఉన్నారనే కదా అర్ధం. నువ్వు అలాంటివాడివని తెలియక ఏడిపించిన ఆ మూర్ఖుల్ని పట్టించుకోకు.

నీకో సంగతి తెలుసా? 'శ్రీనివాస రామానుజం' అని ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త. మన భారతీయుడు. వందపేజీల సింగిల్ రూల్స్ నోట్స్‌మీద ఆయన కాలక్షేపం కోసం చేసిన లెక్కలలో ఒకదానిని కంప్యూటర్లు వున్న ఈ రోజుల్లో ఇద్దరు అమెరికన్ విద్యార్థులు సాధించడానికి పది సంవత్సరాలు పట్టిందని ఈనాటి వార్తలలో నువ్వు ఒకసారి ప్రేయర్‌లో చదివావు గుర్తుందా? ఆయన సుమారు 33 సంవత్సరాల వయసులోనే మరణించారు. ఆయనే బ్రతికుంటే ప్రపంచం అప్పుడే ఇరవై రెండో శతాబ్దంలోకి దూసుకువెళ్ళేది. నువ్వు ఆదర్శంగా తీసుకోవలసింది అటువంటి వాళ్ళనిగానీ చెడును కాదు. గాంధీ తాత వేషం నువ్వు అంత సమర్ధవంతంగా వేయబట్టే అందరూ నిన్ను మెచ్చుకున్నారు. అంటే నువ్వు గాంధీగారిలా కొంచెంసేపయినా అందరినీ నమ్మించగలిగావు అన్నమాటే కదా, ఆ నమ్మకం పునాదిగా వేసుకో. చదువుపట్ల విశ్వాసం పెంచుకో. దాన్ని ఆధారం చేసుకుని వినూత్నమైన విజ్ఞానం సంపాదించు. సమాజాన్ని ముందుకు తీసుకుపోవడానికి నీవంతు కృషి చెయ్యి. ఎవరో మూర్ఖులు ఏడిపించారని అందరూ చదువు మానేస్తే చివరికి నువ్వు తాతయ్య అయ్యేనాటికి ఈ సమాజంలో మనుషులు ఉండరు. పిశాచాలుంటాయి.

అందుకని నువ్వు కష్టపడి చదువుకో. నీ

చదువుకు అంతరాయం కలుగకుండా చూసే పూచీ నాది. మీ అమ్మ అంటావా? మా ఇంట్లో పని చేస్తుంది. మాతోనే తింటుంది. తన జీతం డబ్బులు నీకు ఫీజు కడతాను.

ఇంకోసారి 'నేను చదువుకోను' అన్న మాటలు నీ నుంచి నేను వినకూడదు. మరోసారి ఆ మాటలు అనదలచుకుంటే మాత్రం ఇంకెప్పుడూ నీ మొహం నాకు చూపించకు'' వేదమంత్రాల్లా స్ఫుటంగా ఆమె నోటినుంచి వచ్చిన వాక్యాలకు. వాడి పాల మనసులో ఉత్సాహ కెరటాలు ఎగిసెగిసి పడసాగాయి.

"మేడం! మీ పాదాల మీద ఒట్టు. ఇంకెప్పుడూ మీ మనసు బాధ కలిగేలా తప్పుడు మాటలు మాట్లాడను. తప్పుగా ప్రవర్తించను. మా అమ్మమీద ఒట్టు. మీరు చెప్పినట్లు నడుచుకుంటాను.''

ఆమె కాళ్ళపై సాష్టాంగపడిపోయిన కొడుకును చూసి కళ్ళు తుడుచు కుని పైకి లేవనెత్తింది సుబ్బులక్ష్మి.

రాజేశ్వరీదేవి వాడి కళ్ళు తుడిచి ఆప్యాయంగా తల నిమిరారు. మనసులో మంట పూర్తిగా చల్లారిపోవడం వల్ల కాబోలు ఆమె చల్లని మృదువైన స్పర్శతో వాడు జీవం పోసుకున్న బొమ్మలా కళకళలాడుతున్నాడు. ఆ ఇద్దరి తల్లుల అనిర్వచనీయమైన సంతృప్తికి వెలకట్టకలిగిన కుబేరుడు కావాలి అన్నట్లుగా శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ పటం మీద నుంచి గాలికి ఎగిరిన ముద్దమందారం ఆశీర్వదిస్తున్నట్టుగా వాడితలమీద పడి మరింతగా విచ్చుకున్నట్టుగా ఉంది. పాలలో చేసిన శిల్పంలాంటివాడిని, వాడిని తీర్చిదిద్దిన శిల్పిలాంటి రాజేశ్వరీదేవిని అపురూపంగా, ఆరాధన భావంతో చూస్తూ ఉండిపోయింది సుబ్బులక్ష్మి. ●

'ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక'
డిసెంబర్, 2000